## ఆలయాల నిర్మాణాలు స్ఫూర్తిదాయకం


పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జూన్ 15 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆలయ నిర్మాణాలు నేటికి స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రామన్నను శాలువాతో సత్కరించారు. మొదట వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం రామన్న మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాల నిర్మాణానికి పెద్దపీట వేసిందన్నారు. యాదాద్రితోపాటు కేస్లాపూర్ నాగోబా ఆలయ కట్టడాలు చరిత్రలో నిలిచి పోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేశ్, ఇజ్జగిరి నారాయణ, కుమ్రం రాజు, పరమేశ్వర పాల్గొన్నారు.

## నిర్మల్ కలెక్టర్‌గా అభిలాష అభినవ్

- కామారెడ్డికి బదిలీ అయిన ఆశీష్ సంగ్వాన్
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి

మంచిర్యాల, జూన్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా శనివారం 20 మంది ఐఏఎస్‌లు బదిలీ అయ్యాయి. ఈ మేరకు నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ కామారెడ్డి కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా పని చేస్తున్న అభిలాష అభినవ్ నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా రానున్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా ఉన్న బదావత్ సంతోష్ నాగర్ కర్నూల్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న కుమార్ దీపక్ మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు.


నూతన కలెక్టర్ అభిలాష అభినవ్


బదిలీపై వెళ్తున్న ఆశీష్ సంగ్వాన్

# అన్నదాతల ఆందోళన

**రైతుబంధు, రైతుబీమా ఇవ్వాలని డిమాండ్**

- రుణమాఫీపై ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి..
- ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- వినతిపత్రం అందజేత


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు, రైతులు

నిర్మల్, జూన్ 15(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని అన్నదాతలు ఆందోళన బాట పట్టారు. సకాలంలో ఎరువులు, విత్తనాలు, రైతుబంధు, రైతుబీమాతోపాటు రుణమాఫీ అమలు కాకపోవడంతో రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనలో ఇలాగే పోరాటాలు చేసేవాళ్లమని పాత రోజులను గుర్తు చేసుకుంటున్నారు. ఈ మేరకు శనివారం రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం(ఏఐపీకేఎస్) ఆధ్వర్యంలో నిర్మల్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నంది రామయ్య మాట్లాడుతూ.. వానకాలం ప్రారంభమైనప్పటికీ సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో లేవని, నేటికీ రైతుబంధు సాయం అందలేదని, ఎప్పుడు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు సమస్యలపై రేవంత్‌రెడ్డికి అవగాహన లేదని విమర్శించారు. సబ్సిడీపై అందజేయాల్సిన ఎరువులు, విత్తనాలను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనాల్సిన దుస్థితి నెలకొన్నదంటున్నారు. రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలను అరికట్టి, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి రైతు సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జక్కుల రాజన్న, ఏ.శంకర్, రాజన్న, మచ్చ శ్రీనివాస్, గోనె లచ్చన్న, లక్ష్మణ్, సంతోష్, రైతులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

### సమస్యలను పరిష్కరించాలి..



వానకాలం ప్రారంభమైనా రైతుబంధుపై విధివిధా నాలు రూపొందించకపోవడం శోచనీయం. వెంటనే పంట పెట్టుబడి సాయాన్ని అందించి రైతులను ఆదుకోవాలి. చాలా చోట్ల మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయి. ఎక్కడ చూసినా ఎరువులు, విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉంది. మాది రైతు ప్రభుత్వమని, ప్రజా పాలన అందిస్తామని చెప్పే సీఎం రేవంత్‌రెడ్డి రైతు సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ప్రభుత్వం రైతు సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

*- నంది రామయ్య, ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు, నిర్మల్.*

### రైతుబంధు ఇవ్వాలి..



నాకు బావాపూర్ శివారుల రెండెకరాల భూమి ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ పాటికే రైతు బంధు సాయం అందింది. ఈ కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చిన తర్వాత యాసంగి డబ్బులను మొన్న టి వరకు వేశారు. ఈ వానకాలం పంటకు ఎప్పుడు ఇస్తరో ఏమో తెలియడం లేదు. జీలుగ విత్తనాలు కూడా దొరకడం లేదు. బ్యాంకులో రూ.1.40 లక్షల పంట రుణం ఉన్నది. రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పి ఆరు నెలలు దాటింది. బ్యాంకు వాళ్లు డబ్బులు కట్టుమని ఒత్తిడి చేస్తున్నరు. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతుల పరిస్థితి అధ్వా న్నంగా తయారైంది.

*- కుర్మ రాజన్న, రైతు, బావాపూర్(కే), ఖానాపూర్ మండలం.*


కేశవపట్నం గ్రామస్తులతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## దౌర్జన్యాన్ని సహించం

- పంట భూముల్లో అటవీ అధికారులు మొక్కలు నాటొద్దు
- ఏళ్లుగా కేశవపట్నం గ్రామస్తులు సాగు చేస్తున్నారు
- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- స్థానికులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ఆదిలాబాద్, జూన్ 15(నమస్తే తెలంగాణ) : ఇచ్చోడ మండలంలోని కేశవపట్నంలో స్థానికులు ఏళ్లుగా అటవీ భూములను సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారని, వారిపై అటవీ శాఖ అధికారులు దౌర్జన్యం చేస్తే సహించేది లేదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. తాము 30 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు అక్రమించుకుని మొక్కలు నాటడానికి గుంతలు తవ్వుతున్నారని గ్రామస్తులు భారీ సంఖ్యలో శనివారం ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి తమ సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు గతేడాది బోథ్ నియోజకవర్గంలో అటవీ భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. పోడు భూముల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న గిరిజనేతరుల సమస్యను పరిష్కరించడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అటవీ భూములు సాగు చేసుకుంటున్న గిరిజనేతరుల సమస్యను పట్టించుకోకపోవడంతో అటవీశాఖ అధికారులు భూములను స్వాధీనం చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం, గుండాల, సిరిచెల్మ, ఎల్లమ్మగుట్ట, బాబ్జీపేట్ గ్రామాల్లో గిరిజనేతరులు వ్యవసాయమే జీవనాధారంగా చేసుకుని బతుకుతున్నారని, ఇప్పుడు భూములు కోల్పోతే వారికి ఉపాధి ఎవరు కల్పిస్తారని ప్రశ్నించారు.

### తీరు మారకపోతే ఆందోళనలు

అటవీ అధికారులు తమ తీరు మార్చుకోకపోతే ఆయా గ్రామాల ప్రజలతో కలిసి ఆందోళనలు తీవ్రం చేస్తామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. ఇటీవల తాను ఆ గ్రామాల్లో పర్యటించి అటవీ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. వారు గ్రామస్తులపై వేధింపులు మానుకోకపోగా తిరిగి సాగు భూముల్లో ట్రెంచ్‌లు ఏర్పాటు, మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం చేస్తున్నారని తెలిపారు. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నార న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని గిరిజనేతరు సాగు చేస్తున్న అటవీభూముల విషయాన్ని తొందరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ జడ్పీటీసీ సుధాకర్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, కేశవపట్నం ఎంపీటీసీ అల్తాఫ్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్ (మాస్క్ ధరించిన వారు నిందితులు)

## భార్య పనే..

**వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ఘాతుకం**

- ప్రియుడు మహేశ్‌తో కలిసి హత్యకు ప్రణాళిక
- ఇద్దరు వ్యక్తులకు రూ.6 లక్షల సుఫారీ ఇచ్చి డీల్
- వివరాలు వెల్లడించిన ఉట్నూర్ డీఎస్పీ నగేందర్

ఉట్నూర్/నార్నూర్, జూన్ 15 : వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను కడతేర్చిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్నూర్ మండలంలోని నాగల్‌కొండకు చెందిన జాదవ్ గజేందర్(41) బేల మండలంలోని మేడిగూడ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఇతను జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే ఇతని భార్య జాదవ్ విజయలక్ష్మి నిజామాబాద్‌లో డిగ్రీ చదివేటప్పుడు రాథోడ్ మహేశ్‌తో ప్రేమలో పడింది. పెళ్లికి పెద్దవాళ్లు ఒప్పుకోక జాదవ్ గజేందర్‌కు విజయలక్ష్మిని ఇచ్చి వివాహం చేశారు. కానీ.. అప్పటి నుంచి వీరి ప్రేమ వ్యవహారం కాస్తా అక్రమ సంబంధంగా మారింది. గజేందర్ లేని సమయంలో మహేశ్ ఇంటికి వచ్చిపోయేవాడు. వీరి అక్రమ సంబంధం బయటపడడంతో పంచాయతీ పెట్టి మందలించారు. ఇక బదిలీలలో భాగంగా గజేందర్ సొంత మండలమైన నార్నూర్ పరిసరాలకు బదిలీ చేసుకునే ఆలోచనలో ఉన్నాడు. ఇదే జరిగితే తన వ్యవహారం నడవదన్న కోపంతో ప్రియుడితో కలిసి హత్యకు ప్రణాళిక వేసింది. ఇందులో భాగంగా బేల మండలంలో ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న బోడే సుశీల్, ఉర్వేత కృష్ణలకు తలో రూ.3 లక్షల చొప్పున ఇచ్చి హత్య చేయడానికి బేరం కుదుర్చుకుంది. ప్రణాళిక ప్రకారం ఈనెల 12వ తేదీన జైనథ్ మండలంలో విధులకు హాజరై తిరిగి వస్తుండగా.. గాదిగూడ మండలంలోని అర్జుని వద్ద సదరు సుఫారీలు జాదవ్ గజేందర్‌ను ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టి, కింద పడ్డ అతనిని చేలలోకి లాక్కెళ్లి బండరాళ్లతో కొట్టి హత్య చేశారు. తండ్రి బిక్కు నాయక్ కోడలిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు విజయలక్ష్మిని తనదైన శైలిలో విచారించారు. ఇక ప్రియుడు, సుఫారీల బాగోతం బయటకు వచ్చింది. శనివారం పోలీసులు ఏ1 జాదవ్ విజయలక్ష్మి, ఏ2 రాథోడ్ మహేశ్, ఏ3 బోడే సుశీల్, ఏ4 ఉర్వేత కృష్ణలను పట్టుకుని రిమాండ్‌కు పంపారు. వీరిపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉట్నూర్ సీఐ మొగిలి, నార్నూర్ సీఐ రహీం పాషా, సిబ్బంది ఉన్నారు.

### సామాజిక మాధ్యమాల్లో నిందితురాలి వాయిస్ మెస్సేజ్

జాదవ్ గజేందర్ హత్య జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ హత్యను పోలీసులు తొందరగానే ఛేదించడంతో సుఫారీ హత్యగా బయటపడింది. దీంతో సుఫారీ తీసుకున్న వారు, రాథోడ్ మహేశ్‌తో ప్రేమ వ్యవహారం, హత్యకు వేసిన ప్రణాళికల వాయిస్ రికార్డులు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. దీంతో పోలీసులు ప్రెస్‌మీట్ పెట్టేలోగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది.






## ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి శిక్షించాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్
- టీచర్ గజేందర్ కుటుంబానికి న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

ఎదులాపురం, జూన్ 15 : ఈనెల 12న నార్నూర్ మండలంలోని అర్జుని సమీపంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజేందర్(32)ను కిరాతకంగా హత్య చేశారని, నిందితులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరగా శిక్షించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ రాజర్షి షాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివాహేతర సంబంధానికి తన భర్త గజేందర్ అడ్డు వస్తున్నాడని, కిరాయి హంతకులతో హత్య చేయించిన భార్య, ప్రియుడు, హంతకులను త్వరగా శిక్ష పడేలా చూడాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటే కచ్చితంగా కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు బదిలీ చేసి త్వరగా శిక్ష పడేలా చూడాలన్నారు. ఈ విషయంలో ఎస్పీ గౌష్ ఆలంతో మాట్లాడతానని, బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు.


టీచర్ హత్య కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఎదులాపురం, జూన్ 15 : ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో జరిగిన వివాహిత హత్య కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను టూటౌన్, వన్ టౌన్ సీఐలు ఏ.అశోక్, కే.సత్యానారాయణలతో కలిసి వెల్లడించారు. ఈ నెల 13వ తేదీన పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ రోడ్డు పక్కన గుర్తు తెలియని వివాహిత మృతదేహాన్ని గుర్తించారు. మొదటగా గుర్తు తెలియని వ్యక్తి హత్యగా కేసు నమోదు చేసి వన్, టూ టౌన్ సీఐలు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. ఖుర్షీద్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ ఖలీల్ ఖాన్ మహారాష్ట్ర నుంచి వచ్చిన భారతి అలియస్ సల్మా పదేండ్ల క్రితం జిన్నింగ్ ఫ్యాక్టరీలో పరిచయం కావడంతో ఆమెను రెండో పెళ్లి చేసుకున్నాడు. కాగా.. ఖలీల్ ఖాన్‌కు ఇది వరకే భార్య, పిల్లలు ఉన్నారు. అయితే గత కొన్ని నెలల నుంచి సల్మాను అనుమానంతో హింసిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 12వ తేదీన రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చిన భర్తకు ఎవరో పారిపోయారేమోనని అనుమానం వచ్చింది. దీంతో తన భార్యపై విరుచుకుపడి కోట్టి, పక్కనే ఉన్న కర్రలతో ముఖంపై తీవ్రంగా దాడి చేసి చంపేశాడు. భార్య మృతదేహాన్ని తన ఆటోలో తీసుకెళ్లి ఖుర్షీద్‌నగర్ సమీపంలోని నగర్వాల్ జిన్నింగ్ ప్రాంతంలో పడేసి పారిపోయాడు. 13 తేదీన పోలీసులు గుర్తు తెలియని వివాహిత మృతదేహంగా గుర్తించి విచారణ చేపట్టారు. కాగా.. ఈ మృతదేహం తమ కూతురుదేనని తల్లి సుభద్ర, సోదరి అనసూయ పోలీసులకు చెప్పారు. ఈ మేరకు పోలీసులు నిందితుడైన భర్తను ఖలీల్ ఖాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో సీఐలు, ఎస్ఐ లాల్‌సింగ్‌నాయక్, ఐడీ పార్టీ టీమ్ సభ్యులు రమేశ్, నరేశ్, క్రాంతి పాల్గొన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

## వర్షాలు కురవాలని..

భైంసా టౌన్, జూన్ 16 : సుంక్లి గ్రామానికి చెందిన రైతులు వర్షాలు సమృద్ధిగా కురవాలని కాలినడకన బాసరకు వెళ్లి గంగనీళ్లను (గోదావరి) బాజాభజంత్రీలతో ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గంగా జలంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని రైతులు వరుణ దేవుడిని వేడుకున్నారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


కాలినడకన బాసరకు వెళ్లి గంగనీళ్లను ఊరేగింపుగా తీసుకొస్తున్న సుంక్లి గ్రామస్తులు


